
ఉప్పునూతుల నరసింహారెడ్డి




దొర 'గడీ'లో చాలా హడావిడిగా ఉంది.

ఆ రోజు పంచాయతీ లెక్కలు చూడటానికి డి.ఎల్.పి.వో ప్రత్యేకంగా వస్తున్నాడు.

డివిజనల్ పంచాయితీ ఆఫీసర్ రామారావు రాక సందర్భంగా ఆ 'గడీ' యజమాని రాజారావు దొర ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నాడు.

రాజారావు దొర ఆ గ్రామానికి తిరుగులేని నాయకుడు.

తాతల నాటి నుండి వస్తున్న పెత్తందారీ వ్యవస్థను ప్రజాస్వామ్య పరిపాలనా కాలంలో కూడా చేయి దాటిపోకుండా కాపాడుకుంటున్నాడు.

గ్రామ సర్పంచ్‌గా దశాబ్దాలపాటు తానే కొనసాగాడు.

రిజర్వేషన్ల పుణ్యమా అని తప్పుకోవలసి వచ్చింది.

ఐనా తన పాలేరు మాణిక్యాన్ని సర్పంచ్‌ను చేసి పెత్తనం చేజారిపోకుండా జాగ్రత్తపడ్డాడు.

వేలిముద్రగాడైన మాణిక్యం దొర ముద్ర వేయమన్న చోట వేస్తూ, విశ్వాసపాత్రునిగా ముద్ర వేసుకున్నాడు.

రాష్ట్రంలో వయోజన విద్యా కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వం యం.ఆర్.పి. (మండల రిసోర్స్ పర్సన్) అనే ప్రత్యేక పోస్టు ఏర్పాటు చేసింది.

ఈ యం.ఆర్.పి. మండలమంతా తిరిగి స్థానికుల సహకారంతో చదువురాని పెద్దలకు నచ్చజెప్పి అక్షర జ్ఞానం కలిగించాలి. యం.ఆర్.పి. ప్రభాకర్ యువకుడు, ఉత్సాహవంతుడు.

తనకిచ్చిన బాధ్యత సామాన్యమైనది కాదని, నైతిక బాధ్యత అందులో ఇమిడి ఉందని సంపూర్ణంగా నమ్మాడు.

గూడూరు లాంటి పెద్ద గ్రామ సర్పంచ్ మాణిక్యం చదువురాని వానిగా ఉండటం అతనికి నచ్చలేదు.

మాణిక్యానికి చదవటం, రాయటం నేర్పి మంచి ప్రయోజకున్ని చేయాలని, వయోజన విద్యా కార్యక్రమంలో తన ప్రథమ కర్తవ్యంగా భావించాడు.

మాణిక్యానికి చదువు విలువ తెలిపి అంగీకారం పొందగలిగినా, రాజారావుకు మాణిక్యం చదువుకోవటం ఇష్టం లేదని గ్రహించాడు.

మాణిక్యం చదువు చాలా రహస్యంగా జరిగింది.

మండల కేంద్రంలోని ప్రభాకర్ ఇంట్లో నేర్చుకున్న అక్షరాలు రాత్రిళ్ళు మాణిక్యం ఇంట్లో దిద్దబడి ఆయన మెదడులోని 'జ్ఞాపకాల అర'లో భద్రపరచబడేవి.

ఆ విధంగా చదువుల తల్లి చల్లని చూపుతో మాణిక్యం అక్షరాలన్నీ త్వరలోనే రాయటం నేర్చాడు.

కొన్ని నెలల్లోనే చదవటం నేర్చుకోగలిగాడు.

మాణిక్యంలో మానసికంగా ఎదిగిన భావన కలిగి తృప్తి చెందాడు.

యం.ఆర్.పి. ప్రభాకర్ తన లక్ష్యం నెరవేరిందని సంతోషించాడు.

మాణిక్యాన్ని ఆదర్శంగా చూపిస్తూ మిగతా వారందరినీ ఒప్పించి అక్షరాస్యులను చేయాలన్న ఆశయంతో అతను కార్యోన్ముఖుడైనాడు.

★ ★ ★

రాజారావు నౌకరుతో 'ఒరేయ్ మాణిక్యాన్ని పిలుచుకురా' అన్నాడు.

'అయ్యా' అంటూ పరుగెత్తుకెళ్ళిన రంగన్న కాసేపటిలో మాణిక్యంతో సహా తిరిగి వచ్చాడు.

మాణిక్యం వస్తూనే 'నమస్కారమండి' అన్నాడు.

రాజారావు ఆశ్చర్యంగా చూశాడు.

'ఏమిట్రోయ్ మాట తీరు మారిందే' అనుకున్నాడు.

'దండాలయ్యా' పోయి 'నమస్కారమండి' అయ్యింది' అని ఆయన మనసు ఆక్రోశించింది.

పైకి ప్రశాంతంగా 'మాణిక్యం! కొన్ని పనులు చేయించాలి. చెక్కు మీద వేలి ముద్ర వేయి' అంటూ చెక్‌బుక్, పాస్‌బుక్, ప్యాడ్ మాణిక్యం ముందుంచాడు.

ఎప్పటిలా చెక్కు మీద వేలిముద్ర వేయకుండా మాణిక్యం ఎంతో నింపాదిగా 'ఇదివరకు బ్యాంకు నుండి ఎత్తిన డబ్బుతో ఏ పనులూ చేయించలేదు. మరలా డబ్బెందుకండీ' అంటూ సున్నితంగా తిరస్కరించాడు.

రాజారావు ఆగ్రహంగా 'ఏంట్రా పెద్ద తెలిసినోడిలా మాట్లాడుతున్నావ్. ఇదేంటి? యం.బి. బుక్కు. ఇంజనీరు పని జరిగినట్లు రికార్డు చేశాడు. ఆ మాటకొస్తే ఎత్తిన డబ్బు కన్నా ఎక్కువ పని జరిగింది' అంటూ యం.బి. బుక్కు మాణిక్యం ముందుకు విసిరాడు.

మాణిక్యం కొన్ని క్షణాలు మౌనంగా రాజారావును గమనించాడు. యం.బి. బుక్కు చేతిలోకి తీసుకున్నాడు.

పేజీలు చిన్నగా తిప్పసాగాడు.

'వీడికేమైనా పిచ్చా? పెద్ద చదువొచ్చినట్లు పేజీలు తిప్పేస్తున్నాడు' అన్నట్లు హేళనగా నవ్వాడు రాజారావు.

'దొరా!' అన్నాడు మాణిక్యం. 'ఇందులో మురికి కాలువలు మరమ్మతు చేసినట్లు రాసుంది. అవి ఎప్పుడో మీరు సర్పంచ్‌గా ఉన్నప్పుడు చేసిన పని. మరల ఇప్పుడు రికార్డు చేయబడ్డాయి. అది చాలదన్నట్లు బ్యాంకు నుండి ఇంకా డబ్బు ఎత్తాలనటం న్యాయం కాదు'

రాజారావు ఆశ్చర్యంగా చూడసాగాడు.

రికార్డు బుక్కులోని వివరాలు పేజీ పేజీ చదువుతూ మాణిక్యం విషయం బయటపెట్టి, రాజారావుకు ఓ నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు.

రాజారావు కళ్ళు ఎర్రబడ్డాయి.

మాణిక్యం పతనానికి ప్రణాళిక వేశాడు.

దాని ఫలితమే డి.ఎల్.పి.వో రాక.

మాణిక్యం చేసిన అవకతవకలు స్వయంగా విచారించటానికి వస్తున్నాడు.

ఫిర్యాదుదారు మరెవరో కాదు. రాజారావు దొర!

అందువల్ల డి.ఎల్.పి.వో రానున్న రోజు రాజారావు తన ఇంట్లో పిండివంటలు, కోడికూర, వేటకూర, చేపకూర అన్నీ సిద్ధం చేశాడు.

అరకిలో ఉండే లేత ఊరి కోడిపిల్లలు నాలుగు 'దముకా మురిగ'గా మారాయి.

మేక మాంసం 'ముట్టీలు'గా మారింది.

కొర్రమేను చేపలు ముక్కలుగా మారి బాగా ఫ్రై చేయబడి ప్లేట్లలోకి చేరుకుంది.

'బిర్యానీ' బియ్యంతో బగరా వండించాడు.

ఆ ఘుమఘుమ వాసనలే సగం ఆకలి తీర్చేలా ఉన్నాయి.

ఆ విధంగా రాజారావు దొర డి.ఎల్.పి.వో కోసం చేసిన విందు ఏర్పాటు ఎంతో ఆర్భాటంగా ఉంది.

మిగతా వారికి వేరే ఏర్పాటు చేసి డి.ఎల్.పి.వో. తాను ఇరువురే ప్రత్యేకంగా వెండి కంచాలలో ఏకాంతంగా విందు ఆరగించే ఏర్పాటు చేశాడు. మాంచి సీమ సరుకు తాగటానికి పెట్టించాడు. డి.ఎల్.పి.వోను భోజనానికి ఆయన ఈ ఏర్పాట్లన్నీ చూసి నవ్వుకున్నాడు.

'రండి! డి.ఎల్.పి.వో గారూ! మీ కోసమే ప్రత్యేక ఏర్పాట్లు' అన్నాడు రాజారావు కాస్త గర్వంగా.

'దొరా!' అన్నాడు డి.ఎల్.పి.వో రామారావు.

అతని పిలుపునకు ఆశ్చర్యంగా చూశాడు రాజారావు.

'నా కోసం ఫారిన్ విస్కీ తెచ్చిపెట్టారు. తాగమని.

ఇదే గడీలో నా చిన్నపుడు మీరు తాగే గ్లాసుతో మంచినీళ్ళు తాగానని కోపంతో మీరు కొట్టిన దెబ్బలు మరకలుగా ఇంకా నా వీపును అంటిపెట్టుకునే ఉన్నాయి. ఎట్టి చాకిరి చేసుకుని బతికే నీ ముఖానికి కొడుక్కు చదువు చెప్పించాలనే దుర్బుద్ధి ఎందుకు పుట్టిందిరా? నాగులూ! నీ కొడుకు చదివి కలకటేరు ఐతే నా కొడుక్కు ఎట్టి ఎవడు చేయాలిరా? అని విరగబడి నవ్వి నా తండ్రిని అవహేళన చేసిన దృశ్యం మనసులో మాయని గాయంగా అట్లాగే ఉంది.

దొరా అని దర్జాగా పిలిపించుకుంటూ ఈనాటివరకు నీ పెత్తనం పోకుండా కాపాడుకున్నావు.

**'దొరా!' అన్నాడు మాణిక్యం. 'ఇందులో మురికి కాలువలు మరమ్మతు చేసినట్లు రాసుంది. అవి ఎప్పుడో మీరు సర్పంచ్‌గా ఉన్నపుడు చేసిన పని. మరల ఇప్పుడు రికార్డు చేయబడ్డాయి. అది చాలదన్నట్లు బ్యాంకు నుండి ఇంకా డబ్బు ఎత్తాలనటం న్యాయం కాదు' రాజారావు ఆశ్చర్యంగా చూడసాగాడు.**

మాణిక్యం అమాయకుడు. సర్పంచ్‌ను చేసి నీ పెత్తనం జారి పోకుండా గుప్పిట్లో ఉంచుకున్నావు.

కాని ఓ అద్భుతశక్తి చీకట్లు ఛేదించుకొని ప్రకాశం వెదజల్లటానికి బయలుదేరిందన్న సత్యం గ్రహించలేక పోయావు. ఆ శక్తి ప్రపంచాన్ని శాసించగలదు. ప్రగతినీ సాధించగలదు.

ఆ శక్తి ఓ సామాన్యుడ్ని మహోన్నతుడ్ని చేస్తుంది.

'దొరా! అర్థం కాలేదా?'

'ఆ శక్తి పేరు 'అక్షరం'

అక్షరమిచ్చిన అధికారంతో వచ్చిన ఆనాటి అంటరానివాని అడుగులకు మడుగులొత్తటానికి సిద్ధమైనావ్.

నాతో కలిసి కూర్చుని విందారగించటం అదృష్టంగా భావిస్తున్నావు. నీవు నన్ను చూడటం లేదు. నా హోదాని మాత్రమే చూస్తున్నావు. కాని నేను అలా అనుకోవటం లేదు.

అక్షరం నాకు అహంకారాన్ని ఇవ్వలేదు.

అక్షరం నాకు అధికార దర్పాన్ని ఇవ్వలేదు.

అక్షరం నాకు ఆదర్శాన్ని, ఆత్మపరిశీలనను ప్రసాదించింది.

అక్షరం ముక్కరాని మాణిక్యం లెక్కలు అడిగే స్థితికి ఎదగటం సహించలేక పోయావు.

నీవు తిన్న డబ్బుకు అతన్ని దోషిగా రుజువు చేసి పదవీభ్రష్టుడ్ని చేయాలనుకున్నావు.

చదువురాని మాణిక్యాన్ని జయించగలవేమో కాని, అక్షరం విలువ తెలిసిన మాణిక్యాన్ని జయించలేవు.

అక్షరం అతనికి అండగా ఉంది.

ఆ అక్షరం నా రూపాన ఆదుకుంటుంది.

మాణిక్యాన్ని చేయని తప్పుకు బలి చేయాలని, కాగితం మీద మాత్రమే పనులు చేసి డబ్బులు స్వాహా చేసే ఆలోచనకు స్వస్తి చెప్పు.

ఈ రోజు నుండి మాణిక్యం సర్పంచ్‌గా తన ధర్మం నిర్వర్తిస్తాడు.

పెద్దమనసుతో సహకరించు.

అడ్డుకోవాలని ఆశించినా భంగపాటు తప్పదు.

ఎందుకంటే 'అక్షరం జయించింది' అంటూ ముగించాడు ఆనాటి అంటరాని రాము ఈనాటి డి.ఎల్.పి.వో. రామారావు.

జయించిన 'అక్షరం' ముందు తలవంచాడు రాజారావు దొర! ★


## పాలను ఎలా భద్రపరచాలి?

పాలను ట్యూబ్‌లైట్ల కాంతి దగ్గర ఉంచితే దానిలోని విటమిన్ 'ఏ' 70 శాతం, రిబోఫ్లావిన్ ఇరవై శాతం తగ్గిపోతుంది. ఇలా బేకరీల్లో తరచూ చూస్తుంటాం. కొంత మంది డైనింగ్ టేబుల్‌పైన పాలను పెట్టేస్తారు. సూర్య కాంతికి ఎక్స్‌పోజ్ అవడంవల్ల విటమిన్స్ తరుగుదల మరింత వేగంగా జరుగుతుంది. ఇక ఇంట్లో కాంతివల్ల ఇది కొంచెం నిదానంగా జరిగినా మొత్తానికి విటమిన్స్ కోల్పోయే ప్రమాదం మాత్రం ఉంది. లైట్ల వల్ల పాల రుచిలో కూడా మార్పు వస్తుంది. మాడిపోయిన బంగాళాదుంపలు, లేదా క్యాబేజీ వాసన వస్తుంది. ట్రాన్స్‌పరెంట్ పాత్రలు కాక మందంగా ఉండే పాత్రలలో పాలు ఉంచడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

## గొంతు బొంగురుపోయిందా?

ఏ కారణం లేకుండా అంటే జలుబు, దగ్గు లాంటి బాధ లేమి లేకుండా ఒక్కోసారి గొంతు బొంగురు పోతుంటుంది. అంటే అర్థం మీ స్వరపేటిక అలసిపోయిందన్న మాట. ఇక మాట్లాడటం ఆపి కొంతసేపు నాకు రెస్ట్ ఇవ్వండి అని వోకల్ కార్డ్స్ అభ్యర్థిస్తున్నాయన్నమాట. రెమిడీ ఏమిటి అంటే శుభ్రంగా ఐదు నిమిషాల పాటు స్నానం చేసి, మూలికలతో తయారుచేసిన టీలో కొద్దిగా నిమ్మరసం కలుపుకుని తాగి మాట్లాడకుండా విశ్రాంతి తీసుకోండి. కెఫీన్, పొగ తాగటం, ఆల్కహాల్, రాత్రిపూట ఎక్కువసేపు మేల్కొనడం అన్నీ మానేయండి. మీ స్వరం యథాస్థితికి వస్తుంది.

**కె.బి.కామాక్షి**




## రచయితలకు సూచనలు

ఆదివారం ఆంధ్రభూమికి తమ రచనలు పంపేవారు ఈ కింది సూచనలను విధిగా పాటించాలి.

★ రచయితలు తమ రచనలు పంపే కవర్లపై 'ఆదివారం ఆంధ్రభూమి' అని పేర్కొంటూ, శీర్షిక పేరు కూడా రాయాలి.

★ విలువైన ఫొటోలు, సమాచారం ఉన్న కవర్లను కొరియర్ ద్వారా పంపితే మంచిది.

★ ఆసక్తికరమైన సచిత్ర వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది.

★ పేపర్ కటింగ్‌లు కాకుండా వీలయినంత వరకు ఒరిజినల్ ఫొటోలే పంపాలి.

★ ప్రచురించిన ప్రతి ఆర్టికల్‌కు తగిన పారితోషికం ఉంటుంది కనుక రచయితలు తమ చిరునామాను స్పష్టంగా తెలియజేయాలి.

★ కథలు అచ్చులో రెండు పేజీలకు మించరాదు.

★ వివిధ అంశాలకు సంబంధించిన వ్యాసాలన్నీ రెండు అరఠావులకు మించకుండా ఉంటే మంచిది.

★ వినేసిన జోక్‌లు, చూసేసిన కార్టూన్లు కాకుండా కొత్త వాటినే పంపాలి.

★ వివిధ పత్రికల నుంచి సేకరించే అనువాదాల విషయమై వచ్చే వివాదాలకు రచయితలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

రచనలు పంపాల్సిన చిరునామా

ఎడిటర్,

ఆంధ్రభూమి (ఆదివారం అనుబంధం)

36, సరోజినీ దేవి రోడ్, సికిందరాబాద్.